# సింగిల్ పేజీ కథలు

"ఆఁ..దిగండి...దిగండి..ఎవరి లగేజీ వాళ్ళు మర్చిపోకుండా తెచ్చుకోండి. అరె...కాలు స్లిప్ అవుతుంది...చిన్నగా..."

ఈ అరుపులు, హడావిడికి నేను తలెత్తి రోడ్డువైపు చూశాను. టూరిస్ట్ బస్సులు రెండు ఆగి ఉన్నాయి. 'ఆర్.ఇ.సి వరంగల్' అని బ్యానర్లు కట్టి ఉన్నాయి. కాబోయే ఇంజనీర్లు ఒక్కొక్కరే బస్సులోనుండి దిగుతున్నారు.

మా కాటేజికి ఆనుకుని ఉన్న గెస్ట్‌హౌస్‌లో దిగారంతా. కేకలు, కేరింతలతో అంతా సందడిగా ఉంది. ఇక నాకు ఏకాగ్రత కుదరడం లేదు. ఈరోజుకి నా రచనా వ్యాసంగం కట్టెయ్యాల్సిందే. ఏదో చాలా రోజుల తర్వాత రాయాలన్పించి తెల్లవారుఝామున అయిదు గంటలకే లేచి ఇంటిముందు మామిడిచెట్ల క్రింద కూర్చున్నాను. రెండు పేపర్లైనా రాశానో లేదో ఈ టూరిస్ట్ పిల్లల గొడవతో అంతరాయం కలిగింది. ఇక మూడ్ రాలేదు.

ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థంకాకుండా డైలాగులన్నీ కలగాపులగంగా ఉన్నాయి. ఊస్సూరుమని నిట్టూరుస్తూ నేను బయట లైట్ తీసేసి ఇంట్లోకి నడిచాను. బాబీ, మున్నీ ప్రశాంతంగా నిద్రపోతున్నారు. నిన్నటినుండి పిల్లలకి దసరా సెలవులు. ఈ వారం రోజులు వాళ్లిష్టం. ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు లేస్తారు. ఈరోజు ఆదివారం కావడంతో శ్రీవారికి కూడా రెస్టే.

రాత్రి బాబీ ఎనిమిదవ పుట్టినరోజు ఫంక్షన్ చేశాం. ఇల్లంతా చిందరవందరగా ఉంది. చిన్నగా సర్దటం మొదలెట్టాను. ఇక టైం తెలియలేదు. ఈలోపు బాబీ లేవడం, గెస్ట్ హౌస్ ప్రహారీగోడపై చేరి ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌తో మాటలు కలపడం అయిపోయింది.

బాబీని పిలవడానికి నేనూ వరండాలోకి వెళ్ళాను. నా వెనుకే మున్నీ. గెస్ట్‌హౌస్ వైపు చూసిన నేను చూపు మరల్చుకోలేకపోయాను. తెల్లవారుఝామున నిద్రకళ్లతో, రేగిన జుట్టుతో, నలిగిన బట్టలతో బస్సు దిగుతుంటే సరిగా గమనించలేదు. అప్పుడే విచ్చుకుంటున్న కలువపువ్వుల్లాంటి అమ్మాయిలు గాగ్రా చోళీలు, చుడీదార్లలో చూడముచ్చటగా ఉన్నారు.

వాళ్లని వెన్నంటి వెనుకే వస్తున్న అబ్బాయిల్లో చెప్పలేనంత హుషారు. అందరూ బస్సులో ఎక్కి సాగర్ చూడడానికి వెళ్ళారు. సాగర్ గేట్లు తెరిచే ఆ దృశ్యం కళ్లతో చూడాల్సిందే తప్పితే మాటల్లో వర్ణించలేం.

సాయంత్రం అయిదుగంటలైంది. గెస్ట్‌హౌస్‌లో స్టూడెంట్స్ గంటక్రితమే వచ్చారు. స్నానాలు చేసి బయలుదేరుతున్నారు. ఇంతలో హఠాత్తుగా వాతావరణం మారిపోయింది. చిన్నగా వర్షం మొదలైంది. అది ఇప్పుడిప్పుడే తగ్గే సూచనలు లేవు.

ఈ గంటనుండి అడపాదడపా మాట్లాడుతూ స్టూడెంట్స్ మా వారితో ఫ్రెండ్‌షిప్ చేసుకున్నారు. బాబీ, మున్నీ గోడదూకి వెళ్లి ఎప్పుడో వాళ్లతో జాయిన్ అయ్యారు. పాపం వర్షం వల్ల వాళ్ల ప్రోగ్రాం క్యాన్సిల్ అయింది.

"హలో అంకుల్! ఇక్కడ డిబేట్ జరుగుతోంది. మీరూ రండి ఇంకో జడ్జిగా ఉండాలి" అని విన్పించింది.

## తొలిప్రేమ

"నేను జడ్జిగానా? నే... ఆ పని నావల్లకాదు. మా ఆవిడ రచయిత్రి. ఆవిడైతే కరెక్ట్‌గా సరిపోతుంది" ఈయనగారి సలహా.



ఇంకేముంది నలుగురు అమ్మాయిలు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గొడుగులేసుకుని లోపలకి వచ్చారు.

"ఇంతకీ టాపిక్ ఏమిటి?" ఈయన అడిగారు.

"తొలిప్రేమ"

రచయిత్రినైన నన్ను సహజంగానే ఆ టాపిక్ ఆకర్షించింది. ఇక బెట్టు చెయ్యకుండా ఇంటికి తాళం పెట్టి గొడుగు తీసుకుని గెస్ట్‌హౌస్ వైపు నడిచాం. మేం వెళ్లేసరికి అంతా కామన్ హాల్‌లో క్రిందనే కూర్చుని ఉన్నారు. ప్రిన్సిపాల్, ఇద్దరు లెక్చరర్స్ కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. ప్రిన్సిపాల్ గారు ఒక జడ్జి, నన్ను ఇంకో జడ్జిగా నియమించారు.

స్టూడెంట్స్ అందరి ముఖాల్లో ఎగ్జయిట్‌మెంట్ కనిపిస్తోంది. టాపిక్ అలాంటిది మరి. స్టూడెంట్స్ లీడర్ లేచాడు "డియర్ ఫ్రెండ్స్! టాపిక్ పేరు తొలిప్రేమ. ఇందులో పాల్గొనేవారికి ఒక్కొక్కరికి అయిదు నిముషాలు టైం ఇస్తున్నాం. మొదటి వక్త ఎం.రాజశేఖర్" అనౌన్స్ చేశాడు.

రాజశేఖర్ లేచి మాట్లాడసాగాడు. "ప్రేమ అనే రెండక్షరాల్లో చాలా బలమైన శక్తి ఉంది. లైలా-మజ్ను, సలీం-అనార్కలి, దేవదాసు-పార్వతి. వీళ్ల కథల ద్వారా ప్రేమలో ఎంతశక్తి ఉందో మనకు అర్థం అవుతుంది. ప్రేమించినంత ఈజీగా సఫలం చేసుకోలేదు చాలామంది. ఎనభైశాతం ప్రేమలు విఫలమవుతూనే ఉంటాయి. సక్సెస్ అయినా కాకపోయినా తొలిప్రేమ తుదిదాకా గుర్తుంటుంది. ప్రతి ఒక్కరి జీవితాల్లో చెరిగిపోని ముద్ర వేస్తుంది"

రెండవ విద్యార్థిని శిరీష "తొలిప్రేమ చాలా విలువైంది. కాకపోతే ఈ ప్రేమ ఏ దశలోనైనా కలగొచ్చు. అంటే పదహారేళ్ళ విరిసీ విరియని వయసులో కలగొచ్చు. పాతికేళ్ల పరిణతి చెందిన వయసులో కలగొచ్చు. పిల్లల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, పెద్దల నిర్ణయాలతో జరిగే మన వివాహవ్యవస్థలో పెళ్ళై, పిల్లలు పుట్టాక కూడా ఈ తొలిప్రేమ కలగొచ్చు. కానీ తొలిప్రేమ అందమైన మధురానుభూతి. దానిని సార్థకం చేసుకునేవాళ్ళు నిజంగా అదృష్టవంతులు" చప్పట్లు మ్రోగాయి.

అరగంటలో దాదాపు ఆరుగురు చెప్పారు. పర్లేదు. నేను భయపడినంత విసుగ్గాలేదు. తరువాత వక్త చరణ్‌తేజ. నాకు చాలా ఇష్టమైన పేరు. ఆసక్తిగా ఆ అబ్బాయి వంక చూశాను. ఆ ముఖంలో పసితనపు ఛాయలు కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. బహుశా ఫస్టియర్ అనుకుంటాను. కొంచెం భయపడుతున్నట్లుగా కూడా ఉన్నాడు.

చరణ్‌తేజ చెప్పడం ప్రారంభించాడు.

"తొలిప్రేమ చాలా పవిత్రమైనది. ఈ తొలిప్రేమను భూమి మీద జన్మించిన ప్రతిప్రాణీ తన ప్రమేయం లేకుండానే అనుభవిస్తుంది. యువతీయువకులు ప్రేమలో, భార్యాభర్తలు, స్నేహితులు వీళ్లందరి ప్రేమలో ఏదో ఒక రూపంలో స్వార్థం కనిపిస్తుంది. ఏ స్వార్థం లేని స్వచ్ఛమైన తొలిప్రేమని అందించగలిగేది ఈ ప్రపంచంలో ఒకే ఒక వ్యక్తి. ఆ వ్యక్తి మరెవరో కాదు. మనకు జన్మనిచ్చిన తల్లి" హాలంతా నిశ్శబ్దంగా వినసాగారు. నిముషాలు గడిచిపోతున్నాయి.

"పుట్టిన దగ్గరినుంచి మనకు రెక్కలు వచ్చేవరకూ అన్నీ తానై ఎంతో అపురూపంగా పెంచే తల్లిప్రేమలోని మాధుర్యం మరెక్కడా దొరకదు. ఈ తొలిప్రేమలో ఏమాత్రం తేడాలు కన్పించవు. ఏడంతస్తుల మేడలోని తల్లి ఎంత గారాబంగా తన బిడ్డని ప్రేమిస్తుందో, రోడ్డు ప్రక్కన చెట్టుక్రింద తల్లి కూడా తన బిడ్డని అంతే అపురూపంగా చూస్తుంది. అమ్మాయి-అబ్బాయి ప్రేమలో ఆకర్షణ ఉండొచ్చు. భార్యాభర్తల ప్రేమలో అవసరం ఉండొచ్చు. స్నేహితుల ప్రేమలో స్వార్థం ఉండొచ్చు. కానీ అమ్మ అందించే ఈ తొలిప్రేమ అన్నిటికీ అతీతమైనది. అపురూపమైన ఈ తొలిప్రేమని మర్చిపోతే మన జన్మకి అర్థమే ఉండదు"

"మాధవి గారూ! మీ రిజల్ట్ పేపర్ ఇవ్వండి" ప్రిన్సిపాల్ గారి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. చరణ్‌తేజని మనస్ఫూర్తిగా అభినందించి మా క్వార్టర్ వైపు అడుగులేశాను.

**-బెల్లంకొండ అనూరాధ (నర్సరావుపేట)**